TGTEL/25/A0871
# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :359 | ఆదివారం | 05-07- 2026 | పేజీలు: 4 | వెల రూ. 03

# పైకి మినరల్.. లోపల జనరల్..?

## నిర్మల్ జిల్లా కేంద్రంలో గాలికి నిబంధనలు.. తనిఖీలకు దూరంగా అధికారులు!

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు

నిర్మల్ జూలై 4 తెలంగాణ వెన్నెల వాక్కు
నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో 'మినరల్ వాటర్' పేరుతో సాగుతున్న వ్యాపారం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తోంది. పైకి మినరల్ వాటర్ అని చెబుతూనే.. లోపల మాత్రం సాధారణ నీటిని సరఫరా చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్యూర్ మినరల్ వాటర్, ఆర్వో వాటర్ అనే లేబుళ్లు అంటించి విక్రయిస్తున్న నీటిలో వాస్తవానికి శుద్ధి ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా.. అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. చాలా చోట్ల మినరల్ వాటర్ పేరుతో సాధారణ బోరు నీటిని స్వల్పంగా శుద్ధి చేసి క్యాన్లలో నింపి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

**విచ్చలవిడిగా ప్లాంట్లు.. లోపించిన అనుమతులు**

నిర్మల్ పట్టణంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ఇలాంటి వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పదుల సంఖ్యలో వాటర్ ప్లాంట్లు ఏర్పడి ప్రతిరోజు వందలాది 20 లీటర్ల క్యాన్లను ఇళ్లకు, హోటళ్లకు, దుకాణాలకు సరఫరా చేస్తున్నాయి. అయితే వీటిలో చాలా ప్లాంట్లకు అవసరమైన అనుమతులు, నాణ్యత ధ్రువపత్రాలు లేవనే విమర్శలు ఉన్నాయి. కాలానుగుణంగా నీటి పరీక్షలు చేస్తున్నారా లేదా అన్నది సందేహాస్పదంగా ఉంది. కొన్ని ప్లాంట్లలో ఫిల్టర్లు, యూవీ, ఆర్వో యంత్రాలను సకాలంలో మార్చకపోవడంతో నీటి నాణ్యత దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనలు అమలు ఎక్కడ..?**

ఆహార భద్రత, కాలుష్య నియంత్రణ, మున్సిపల్ మరియు గ్రామపంచాయతీ తదితర శాఖల అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ చాలా ప్లాంట్లు ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్నాయి. క్యాన్లను సరిగ్గా శు భ్రపరచకుండానే మళ్లీ మళ్లీ వినియోగించడం, నీటి నాణ్యతను పరీక్షించకపోవడం వంటి లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పరిశుభ్రత పాటించకపోతే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




**ప్రజల ఆరోగ్యంతో చెలగాటం.. తనిఖీలు చేయాల్సిందే!**

శుద్ధి చేయని లేదా నాణ్యత లేని నీటిని తాగడం వల్ల వైరల్ జ్వరాలు, విరేచనాలు, టైఫాయిడ్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కువ శాతం కలుషిత నీరు వల్లే వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ మినరల్ వాటర్ పేరుతో జరుగుతున్న వ్యాపారంపై పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ?నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా, మండలాల వ్యాప్తంగా అన్ని వాటర్ ప్లాంట్లలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నీటి నమూనాలను పరీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు పాటించని ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: ప్రధాని నరేంద్ర మోదీ




జోధ్‌పూర్ న్యూస్
దేశాభివృద్ధిలో అన్నదాతల పాత్ర అత్యంత కీలకమని, రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజస్థాన్ పర్యటనలో భాగంగా జోధ్‌పూర్‌లో నిర్మించిన అత్యాధునిక కొత్త విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించిన 4

## ఉల్లి రైతులకు కేంద్రం బంపర్ ఆఫర్

### క్వింటాల్‌పై 13 శాతం కొనుగోలు ధర పెంపు




2

## రూపాయి' పెంపుతో కూలీల పొట్ట కొట్టిన కేంద్రం..

### నిర్మల్ జిల్లాలో 2.37 లక్షల మంది గ్రామీణ పేదల బతుకులు ఛిన్నాభిన్నం

నిర్మల్ జూలై 4 తెలంగాణ వెన్నెల వాక్కు
గ్రామీణ పేదల కష్టార్జితంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి తన వివక్షను చాటుకుంది. 'వికసిత్ భారత్' అంటూ ఆర్భాటపు ప్రచారాలు చేసుకుంటున్న పాలకులు, క్షేత్రస్థాయిలో రెక్కాడితే గానీ డొక్కాడని ఉపాధి హామీ కూలీల పొట్ట కొట్టారు. కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ చట్టం (ఎదీ–+=ూవీ +ూమ్) ద్వారా పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించి పెద్ద ఎత్తున హడావుడి చేసిన కేంద్రం.. వేతనాల పెంపు విషయానికి వచ్చేసరికి దారుణమైన మొండిచేయి చూపించింది. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, కూలీల జీవన వ్యయం భారంగా మారుతుంటే.. తెలంగాణ కూలీలకు గత ఏడాది ఉన్న రూ.307 వేతనానికి కేవలం ఒక్కటంటే ఒక్క రూపాయి మాత్రమే పెంచి రూ.308గా ఖరారు చేయడం పట్ల సర్వత్రా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కంటితుడుపు పెంపు కూలీలను అపహాస్యం చేయడమేనని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

**పక్క రాష్ట్రాలపై ప్రేమ.. మనపై ఎందుకీ కక్ష?**

కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతికి ఈ వేతనాల పట్టికే సజీవ సాక్ష్యం. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో రోజువారీ వేతనాన్ని రూ.312కు పెంచిన పాలకులు, హర్యానాలో ఏకంగా రూ.409 చెల్లిస్తున్నారు. ఇక సిక్కిం వంటి రాష్ట్రాల్లోని కొన్ని గ్రామ పంచాయతీల్లో కూలీలకు రోజుకు రూ.450 వరకు అందుతోంది. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు భారీగా నిధులు, వేతనాలు కేటాయిస్తూ, తెలంగాణకు మాత్రం కేవలం రూ.1 పెంపుతో సరిపెట్టడం వెనుక ఉన్న రాజకీయం ఏంటని కూలీలు ప్రశ్నిస్తున్నారు. శ్రమ దోపిడీకి పరాకాష్టగా మారిన ఈ నిర్ణయం వల్ల నిర్మల్ జిల్లాలోని 18 మండలాలు, 396 గ్రామ పంచాయతీల పరిధిలోని లక్షలాది కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

**లక్షలాది మంది నోట్లో మట్టి కొట్టిన నిర్ణయం!**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) గణాంకాలే కేంద్రం చేసిన అన్యాయ తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో 1.32 లక్షల యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా, నిత్యం చెరువుల పూడికతీత, మట్టి పనులు, కాలువల నిర్మాణాలపై ఆధారపడి బతుకుతున్న 2.37 లక్షల మంది యాక్టివ్ కూలీల ఆశలపై ఈ నిర్ణయం పిడుగులా పడింది. సమాజంలో అత్యంత వెనుకబడిన 3,196 మంది దివ్యాంగ కూలీల నోటి కాడి కూడును సైతం ఈ అరకొర వేతనం దూరం చేస్తోంది. రోజుకు రూ.308తో ఈ రోజుల్లో ఒక కుటుంబం మూడు పూటలా తిండి తినడం సాధ్యమేనా అని పాలకపక్షాన్ని కార్మిక నేతలు నిలదీస్తున్నారు.



పెంచిన పనిదినాల వల్ల గరిష్టంగా రూ.37,500 ఆదాయం వస్తుందని కాగితాల్లో లెక్కలు చూపిస్తున్న అధికారులు, వాస్తవ పరిస్థితులను విస్మరిస్తున్నారు. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కనప్పుడు ఎన్ని రోజులు పని కల్పిస్తే ఏం లాభమని కూలీలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ దినసరి వేతనాన్ని కనీసం రూ.400కు పెంచాలని, లేనిపక్షంలో గ్రామీణ పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని కార్మిక సంఘాలు గట్టిగా హెచ్చరిస్తున్నాయి.

## 20 ఏళ్ల నాటి స్మృతుల్లో ముఖ్యమంత్రి

### ఉరుకొండపేట అంజన్న సన్నిధిలో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ సందడి



నాగర్‌కర్నూల్:లి
తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకొండపేట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి వారిని ఆయన దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కృపతో రాష్ట్ర 2

## ఆరో ఎకరా రైతులకూ పెట్టుబడి సాయం నిధులు విడుదల!


హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలో వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్న వేళ అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ తీపి కబురు అందించింది. ప్రస్తుత సీజన్ పంట పెట్టుబడుల కోసం ఉద్దేశించిన ప్రతిష్టాత్మక 'రైతు భరోసా' నిధుల పంపిణీ ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఐదో విడత కింద ఆరు ఎకరాల వరకు సాగు భూమి కలిగిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఎకరానికి రూ.6,000




చొప్పున పెట్టుబడి సాయాన్ని నేరుగా జమ చేసింది. శనివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.69 లక్షల మంది అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.7,135 కోట్ల 2

## ముథోల్ మండల వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి: గంగాధర్

ముథోల్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముథోల్ మండలంలోని అష్ట గ్రామపంచాయతీ పరిధిలో గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించే భవనాలు, వ్యాపార దుకాణాలకు తప్పనిసరిగా గ్రామపంచాయతీ నుండి ముస్తు అనుమతి తీసుకుని, ట్రేడ్ లైసెన్స్ పొందిన తర్వాతే నిర్మాణ పనులు, వ్యాపార కార్యకలాపాలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తే పంచాయతీరాజ్




చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు రోడ్లపై పెంటకుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామకంఠం పరిధిలోని రహదారులపై భారీ వాహనాలను నిలిపివేయడం, అక్రమ నిర్మాణాలు చేపట్టడం, పశువులను రోడ్లపై కట్టేయడం, ట్రాక్టర్లు తదితర వాహనాలను ఇబ్బందికరంగా నడపడం పూర్తిగా నిషేధించబడిందని పేర్కొన్నారు.

## ఆర్మూర్ బాయ్స్ హైస్కూల్‌లో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన

ఆర్మూర్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మన కాలనీ -- మన భద్రత, మన బాధ్యత' అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆర్మూర్ సబ్ ఇన్స్పెక్టర్ యాసిర్ అరఫాత్ విద్యార్థులతో మాట్లాడుతూ, మత్తు పదార్థాల (డ్రగ్స్) వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలన్నారు. అలాగే ఇంటర్నెట్ యుగంలో మారుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. కాలనీల్లో భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్ సేవల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మి నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# వార్త రాస్తే ఆధారాలడుగుతారా?

## వ్యవస్థల వైఫల్యానికి బలవుతున్న జర్నలిజం!

### కలెక్టరేట్లలో నొక్కుకుపోతున్న గొంతుకలు.. విచారణ మీదా? జర్నలిస్టులదా?



ఈ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎండగట్టడం పత్రికా రంగం యొక్క ప్రాథమిక బాధ్యత. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి, వాస్తవాలను సేకరించి, వాటిని పత్రికల ద్వారా లేదా ప్రసార సాధనాల ద్వారా ప్రజల ముందుకు, తద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడం విలేకరుల నిత్యకృత్యం. అయితే, ఇటీవల కాలంలో జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు సైతం వ్యవహరిస్తున్న తీరు విలేకరుల స్వేచ్ఛను పూర్తిగా హరించేలా ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.
ఒక విలేకరి ఎంతో శ్రమించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఒక వార్తా కథనాన్ని ప్రచురించిన తర్వాత, ఆ వార్త ఆధారంగా లోతైన విచారణ జరపాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ, దురదృష్టవశాత్తూ క్షేత్రస్థాయి అధికారులే కాదు.. జిల్లాకు అత్యున్నత అధికారిక బాధ్యత వహించే కలెక్టర్లు సైతం "వార్త రాశారు సరే.. మీ దగ్గర దానికి సంబంధించిన తగిన ఆధారాలు ఉన్నాయా?" అని విలేకరులను తిరగబడి ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది.
పత్రికలో వచ్చిన వార్తే ఒక ప్రాథమిక సాక్ష్యం. దానిపై సుమోటోగా స్పందించి, తన కింద ఉన్న అధికార యంత్రాంగాన్ని పంపి నిజానిజాలు తేల్చాల్సింది పోయి, స్వయంగా కలెక్టరే విలేకరులను ఆధారాలు అడగడం అంటే.. తమ బాధ్యతల నుంచి తప్పుకోవడమే అవుతుంది. జర్నలిస్టులు సమాజ హితం కోరేవారే కానీ, వారు ప్రభుత్వ విచారణ సంస్థలు కాదు. జిల్లా పాలనాధికార కేంద్రాల స్థాయిలోనే జర్నలిస్టులు రాసే వార్తలకు కనీస ప్రామాణికత ఇవ్వకపోతే, ఇక ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత ఎక్కడ ఉంటుంది?

**వ్యవస్థల వైఫల్యానికి బలవుతున్న జర్నలిజం**

కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు జర్నలిస్టులను ఆధారాలు అడగడం వెనుక తమ శాఖల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఒక ప్రభుత్వ విభాగంలో అవినీతి జరిగిందనో, లేదా ఒక గ్రామంలో మౌలిక వసతులు లేవనో వార్త వచ్చినప్పుడు, ఆయా విభాగాల నిఘా విభాగాలు లేదా క్షేత్రస్థాయి పరిశీలకులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వ ఖజానా నుండి జీతాలు తీసుకుంటూ, నిరంతరం నిఘా పెట్టాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, లోపాలను ఎత్తిచూపిన విలేకరిపైనే భారం నెట్టడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట.
మీడియా కేవలం సమాజంలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపే ఒక అద్దం మాత్రమే. అద్దంలో లోపం కనిపిస్తే ముఖాన్ని సరిచేసుకోవాలి కానీ, అద్దాన్ని పగలగొట్టాలని చూడటం లేదా అద్దానికే హెచ్చరిక పత్రాలు (నోటీసులు) ఇవ్వడం ఎంతవరకు న్యాయం? ఈ విధమైన ధోరణి వల్ల క్షేత్రస్థాయిలో నిజాయితీగా పనిచేసే విలేకరులు అధైర్యపడే ప్రమాదం ఉంది, ఇది అంతిమంగా ప్రజాస్వామ్యానికే గండంలా మారుతుంది.

**తప్పుడు నోటీసులు -- విచారణ చేయాల్సిన బాధ్యత ఎవరిది?**

చాలా సందర్భాలలో అధికారులు ఇచ్చే అధికారిక సమాచారం లేదా ప్రభుత్వ ప్రకటనల ఆధారంగానే విలేకరులు వార్తలు రాస్తుంటారు. ఒకవేళ ఆ సమాచారంలో లోపాలు ఉంటే, దానికి బాధ్యులైన అధికారులను ప్రశ్నించాల్సింది పోయి, వార్త రాసిన జర్నలిస్టులకే నోటీసులు జారీ చేయడం ఏ రకమైన న్యాయం?
వాస్తవిక కథనాలు రాసినప్పుడు వాటిలోని నిజాలను విచారణ చేసి తప్పులను సరిదిద్దాల్సింది పోయి, విలేకరులపై కేసులు పెట్టడం, వేధించడం వంటి చర్యలు విలేకరుల గొంతు నొక్కడమే అవుతుంది. జర్నలిస్టులు రాసే ప్రతి వార్తను 'అసత్య వార్త'గా ముద్ర వేయాలని చూడటం సమాజానికి తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి, అక్రమాలను ప్రశ్నించే వారే కరువవుతారు. అధికారులు తాము ప్రజాసేవకులమనే విషయాన్ని మరువరాదు. జర్నలిస్టులు సేకరించే సమాచారం వ్యవస్థను సంస్కరించడానికి ఉపయోగపడాలే తప్ప, వారిపై కక్షసాధింపు చర్యలకు ఆయుధంగా మారకూడదు. ?వార్త ఎలా రాసినా, ఏ ఇబ్బందిని లేవనెత్తినా జర్నలిస్టునే దోషిగా నిలబెట్టే సంస్కృతి మారాలి. పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులను శత్రువులుగా కాకుండా, వ్యవస్థను ప్రక్షాళన చేసే భాగస్వాములుగా కలెక్టర్లు, జిల్లా అధికారులు గుర్తించాలి. పత్రికా స్వేచ్ఛను గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. విలేకరులపై అక్రమ కేసులు, నోటీసుల పర్వానికి స్వస్తి పలికి, వార్తల్లోని వాస్తవాలపై కలెక్టర్లు తమ అధికారిక యంత్రాంగంతో నిజాయితీగా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవడమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అప్పుడే ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థల మీద, మీడియా మీద నమ్మకం నిలుస్తుంది.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

## 20 ఏళ్ల నాటి స్మృతుల్లో ముఖ్యమంత్రి

ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని సీఎం ఆకాంక్షించారు. అనంతరం రూ.10 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఆలయ సమగ్ర అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాకతో ఉరుకొండపేట గ్రామంలో పండుగ వాతావరణం, మునుపెన్నడూ లేని కోలాహలం నెలకొంది.
జెడ్పీటీసీ నాటి ముచ్చట్లు -- ఉద్వేగభరిత స్వాగతం
సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఉరుకొండపేటకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఆయన ఇక్కడి నుంచే జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికై తన రాజకీయ ప్రయాణాన్ని బలంగా ప్రారంభించారు. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత, రాష్ట్ర ముఖ్యమంత్రిగా అదే మట్టిపై అడుగుపెట్టడం ఆయనకు ఒక మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. నాటి జ్ఞాపకాలను గుండెల్లో దాచుకున్న గ్రామానికి చెందిన ఆత్మీయులు, ఆనాటి రాజకీయ పెద్దలు, గ్రామస్థులు ముఖ్యమంత్రికి మంగళహారతులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.
ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆనాటి రాజకీయ తోటి సహచరులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.
జ్ఞాపకాల పల్లెలో ఆత్మీయ సమ్మేళనం
ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమావేశం అత్యంత ఉద్వేగభరితంగా, సాన్నిహిత్యంగా సాగింది. అధికార హోదాలను పక్కనబెట్టి, రేవంత్ రెడ్డి అలనాటి తోటి సహచరులను ఎంతో అప్యాయంగా పలకరించారు. ప్రతి ఒక్కరి వద్దకు స్వయంగా వెళ్లి, కరచాలనం చేస్తూ, ఆలింగనం చేసుకుంటూ వారి క్షేమసమాచారాలను, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. 20 ఏళ్ల కిందట సాధారణ నాయకుడిగా ఉన్నప్పుడు వారితో పంచుకున్న పాత అనుభవాలను, జ్ఞాపకాలను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు.
ఈ క్రమంలో కొందరు పాత మిత్రులు రెండు దశాబ్దాల క్రితం రేవంత్ రెడ్డితో కలిసి దిగిన పాత ఫోటోలను చూపించడంతో సీఎం భావోద్వేగానికి లోనయ్యారు. కాలం మారినా, పదవులు వచ్చినా నాటి బంధాలు, అభిమానం అలాగే ఉన్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉరుకొండపేట ప్రజలు చూపించిన ఈ ఆదరాభిమానాలు తన బాధ్యతను మరింత పెంచాయని పేర్కొన్నారు.
ప్రముఖుల సమక్షంలో అభివృద్ధికి బాటలు
ఆంజనేయ స్వామి ఆలయాన్ని యాదాద్రి తరహాలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్లు కేటాయించామని, భక్తులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ అద్భుత ఘట్టంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు) మల్లు రవి, వేం నరేందర్ రెడ్డిలతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
సొంత నియోజకవర్గ నేత, నాటి జెడ్పీటీసీ సభ్యుడు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వచ్చి తమ మధ్య గడపడం, గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించడంపై ఉరుకొండపేట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.



## ఉల్లి రైతులకు కేంద్రం బంపర్ ఆఫర్

న్యూఢిల్లీ బ్యూరో
దేశంలోని ఉల్లి సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. మార్కెట్‌లో ఉల్లి ధరలు అదుపు తప్పకుండా చూడటంతో పాటు, రైతులకు మెరుగైన మరియు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల స్థిరీకరణ బఫర్ స్టాక్ (అత్యవసర నిల్వలు) సేకరణ కోసం ప్రభుత్వం సేకరించే ఉల్లిపాయల కొనుగోలు ధరను ఏకంగా 13 శాతం పెంచుతున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.
తాజా సవరణతో ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.1,875 గా ఉన్న ఉల్లి కనీస కొనుగోలు ధర, ఇప్పుడు ఏకంగా రూ.250 పెరిగి లిరూ.2,125లి కు చేరింది. పెంచిన ఈ నూతన ధరలు తక్షణమే (జూలై 4 నుంచి) అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
ఈ సీజన్‌లో ఐదో సారి పెంపు
ప్రస్తుత మార్కెటింగ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం ఉల్లి కొనుగోలు ధరలను పెంచడం ఇది ఐదో సారి కావడం గమనార్హం. ధరల స్థిరీకరణ నిధి కింద 2026 బఫర్ స్టాక్ కోసం ఉల్లి కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో వేగంగా సాగకపోవడమే ఈ వరుస పెంపునకు ప్రధాన కారణం. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం కేవలం 2,000 టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించగలిగింది. ఈ నేపథ్యంలో రైతులను ప్రోత్సహించేందుకు సీజన్ ప్రారంభం నుండి కిలో ఉల్లి ధరను రూ.12.70 నుండి క్రమంగా రూ.15.80, రూ.16.50, రూ.17.30, రూ.18.75 కు పెంచుతూ వచ్చారు. తాజాగా దానిని కిలోకు రూ.21.25 (క్వింటాల్‌కు రూ.2,125) కు పెంచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా నాఫెడ్ , ఎన్‌సీసీఎఫ్ వంటి ప్రభుత్వ సహకార సంస్థల ద్వారా ఉల్లిపాయల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల ఉల్లి రైతులకు బహిరంగ మార్కెట్‌లోనూ మెరుగైన రాబడి లభించనుంది.
దేశంలో సమృద్ధిగా ఉల్లి నిల్వలు
వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ విడుదల చేసిన 2025-26 ద్వితీయ ముందస్తు అంచనాల ప్రకారం.. ఈ ఏడాది దేశంలో ఉల్లి ఉత్పత్తి దాదాపు 307.37 శ్రీుఎన్ష్ర ఎవ్‌తీఅవ్ శీఅఅవం గా నమోదయ్యే అవకాశం ఉంది. ఇది గత ఏడాది (2024-25) నాటి 307.67 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దాదాపు సమానంగా ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం దేశంలో ఉల్లి లభ్యతకు ఎలాంటి ఢోకా లేదని, అయితే సాధారణ కాలానుగుణ మార్పుల వల్ల (లీన్ పీరియడ్) రాబోయే రోజుల్లో ధరల్లో స్వల్ప పెరుగుదల ఉండవచ్చని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి ప్రధాన ఉల్లి ఉత్పత్తి రాష్ట్రాలలో తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది.
ప్రస్తుతం దేశవ్యాప్తంగా రోజువారీ మండి రాకలు 50,000 మెట్రిక్ టన్నులకు పైగా బలంగా ఉండగా, కేవలం మహారాష్ట్ర నుంచే 30,000 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఉల్లి మార్కెట్‌కు వస్తోంది.

## ఆరో ఎకరా రైతులకూ పెట్టుబడి సాయం నిధులు విడుదల!

భారీ మొత్తాన్ని ప్రభుత్వం సక్సెస్‌ఫుల్‌గా బదిలీ చేయడం విశేషం.ఈ ఏడాది జూన్ 30 నుంచి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, ఎలాంటి మధ్యవర్తులు లేదా అవినీతికి తావు లేకుండా విడతల వారీగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీ) పద్ధతిలో ఈ నిధులను రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేస్తోంది. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ఇప్పుడిప్పుడే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తూ, విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు జోరందుకున్న తరుణంలో ప్రభుత్వ ఆర్థిక సాయం నేరుగా చేతికి అందడంతో సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ఈ నిధుల పంపిణీని దశలవారీగా చేపట్టింది. పథకం ప్రారంభమైన తొలి రోజున ఒకటి మరియు రెండు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న అట్టడుగు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకున్నారు. ఆ తర్వాత వరుసగా మూడు ఎకరాలు, నాలుగు ఎకరాల భూమి ఉన్న రైతులకు నిధులు విడుదలయ్యాయి. నిన్నటితో ఐదో ఎకరా రైతుల పంపిణీ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకుని, తాజాగా శనివారం నాడు ఆరు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు కూడా నిధులు సక్సెస్‌ఫుల్‌గా విడుదల కావడంతో క్షేత్రస్థాయిలో పంపిణీ వేగం ఒక్కసారిగా పుంజుకుంది.వ్యవసాయ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం.. జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు అత్యధిక శాతం అర్హులైన రైతుల ఖాతాల్లోకి నిధులు చేరిపోయాయి. మార్కెట్‌లో రసాయన ఎరువులు, విత్తనాలు మరియు సాగు ఖర్చుల భారం పెరిగిన తరుణంలో ప్రభుత్వ ఆర్థిక అండ తమకు ఎంతో

## గౌతమ్ మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటిన మున్సిపల్ వైస్ చైర్మన్



నిర్మల్ టౌన్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా శనివారం ప్రియదర్శిని నగర్ లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన హరితహారం మొక్కల నాటే కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన, హరితమైన సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జగతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిలర్లు కత్తి నరేందర్, లక్కాకుల హరీష్, నాయకులు అజార్, అడప శ్రీకాంత్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ ను 'యూటి' చేసే కేంద్ర యోచనపై రేపు నిర్మల్ లో టీపీజేఏసీ అత్యవసర భేటీ

నిర్మల్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): హైదరాబాద్ ను యూనియన్ టెరిటరీగా (కేంద్రపాలిత ప్రాంతం) లేదా దేశ రెండవ రాజధానిగా ప్రకటించాలనే యోచనతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు వస్తున్న వార్తలపై చర్చించేందుకు జూలై 5వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు నిర్మల్ లోని పెన్షనర్ల భవన్ లో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు టీపీజేఏసీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ లో తీసుకుంటున్న కొన్ని చర్యలు దీనికి ఊతం ఇచ్చే దిశగానే ఉన్నాయన్నారు. ఇదే జరిగితే తెలంగాణ తన అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోతుందని, తెలంగాణ తలలేని మొండెంగా మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మేధావులతో చర్చించడానికి హైదరాబాద్ నుండి ప్రొఫెసర్ వినాయకరెడ్డి, చలపతిరావు, కే వేణుగోపాల్, ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షులు, బీ కొండల్ రెడ్డి (టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు) తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. కావున జిల్లాలోని సంఘాల నాయకులు, మేధావులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## ఆరవ వార్డులో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆర్మూర్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణంలోని ఆరవ వార్డు పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. వార్డు కౌన్సిలర్ మమత గంగాధర్ గౌడ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఆరవ వార్డు వాస్తవ్యురాలు గంగుబాయికి 60,000 రూపాయల చెక్కును, అలాగే బోర్ గల్ కాలనీకి చెందిన గంగామణికి 8,500 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా తమకు వైద్య సహాయం నిమిత్తం చెక్కులు అందేలా సహకరించిన వినయ్ కుమార్ రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ



ఆర్మూర్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల హనుమాన్ మందిరం పక్కన ఉన్న కమ్యూనిటీ హాల్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ శనివారం ముమ్మరంగా సాగింది. ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి మూడో వార్డు, 19వ వార్డుకు సంబంధించిన ఓటర్ల ఫారాలను బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) ఉచితంగా పూర్తి చేసి ఇస్తున్నారు. కావున ఈ రెండు వార్డులకు సంబంధించిన ఓటర్లు తమ నివాస ధృవీకరణ, ఆధార్ పత్రాలను తీసుకువచ్చి ఓటరు జాబితాలో వివరాలను నమోదు చేయించుకోవాలని అధికారులు కోరారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు వార్డుల కౌన్సిలర్లు, బీఎల్ఓలు అందుబాటులో ఉంటున్నారు.

## చేపూర్ గ్రామంలో బీఎల్ఏలకు గుర్తింపు కార్డుల పంపిణీ



చేపూర్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ మండల పరిధిలోని చేపూర్ గ్రామంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) శనివారం అధికారిక గుర్తింపు కార్డులను (ఐడెంటిటీ కార్డ్స్) అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ (డీసీసీ) కార్యదర్శి ఫతేపూర్ ప్రవీణ్ చేతుల మీదుగా పార్టీ తరపున నియమితులైన బీఎల్ఏలకు ఈ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఏజెంట్లు పారదర్శకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో చేపూర్ గ్రామ సర్పంచ్ సరంగి శాంతి కుమార్, బీఎల్ఏ ఏ శ్రీనివాస్, ఓబీసీ విభాగం అధ్యక్షుడు సుభాష్, సీనియర్ నాయకులు చిట్యాల పోశెట్టి, దుబ్బాక రాము పాల్గొన్నారు.

# రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

## గుంతల బురదలో మాయపూర్ గ్రామం

**- చిన్నపాటి వర్షానికే నరకప్రాయంగా మారుతున్న ప్రయాణం**
**- నాలుగు కిలోమీటర్ల దూరానికి అరగంట సమయం.. పట్టింపు లేని అధికారులు**



(తెలంగాణ వెన్నెల వాక్కు ప్రత్యేక కథనం)
దిలావర్‌పూర్, జూలై 4:
చిన్నపాటి వర్షం కురిసినా బయటకు వెళ్లడం కష్టంగా మారిందని, గుంతలు, బురదతో నిండిన రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాయపూర్ గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన బీటీ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని ఎన్నడూ మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయి పెద్ద పెద్ద గుంతలమయంగా మారింది. వర్షం పడిన వెంటనే ఆ గుంతలన్నీ నీటితో నిండిపోయి రోడ్డు ఎక్కడ ఉందో కూడా తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొంది.



మాయపూర్ గ్రామానికి వడ్డేపల్లి ఎక్స్ రోడ్ నుండి చిట్యాల ఎక్స్ రోడ్ వరకు గల సుమారు 4 కిలోమీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద

**అభివృద్ధికి ఆమడ దూరం.. తక్షణమే స్పందించాలి:**

నిర్మల్-భైంసా జాతీయ రహదారికి కేవలం 4 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ శిథిల రోడ్డు కారణంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, స్కూల్ వాహనాలు కూడా గ్రామానికి రావడానికి ఇబ్బంది పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో తమ ఊరు అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు ఆశపడ్డారు. కానీ గ్రామ పంచాయతీ ఏర్పడి ఏళ్లు గడిచినా మాయపూర్ అభివృద్ధికి నోచుకోలేదు. చిట్యాల రోడ్డు నుండి ముజ్గీ వరకు రహదారిని రెండు వాహనాలు వెళ్లేలా వెడల్పు చేసినప్పటికీ, మాయపూర్‌ను కలుపుతున్న ఈ 4 కిలోమీటర్ల రోడ్డును మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు దుస్థితి కారణంగా రోజూ విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును వెంటనే మరమ్మతులు చేసి గ్రామస్తుల రవాణా కష్టాలను తీర్చాలని మాయపూర్ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యా ప్రమాణాల అమలులో అలసత్వం వద్దు: నాంపల్లి రాజేష్



నిర్మల్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రభుత్వ విద్యాశాఖ కార్యక్రమాల విజయవంతమైన అమలులో అలసత్వం వహించరాదని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్రస్థాయి విద్యా పరిశీలకుడు నాంపల్లి రాజేష్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన, క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ ఏ భోజన్న ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు (ఎంఈఓ), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా కార్యక్రమాల అమలులో ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో రోజువారీ సమీక్షలు నిర్వహించి అన్ని విద్యాసంబంధిత అంశాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా విద్యార్థుల ప్రవేశాల నమోదు, ప్రీ-ప్రైమరీ అడ్మిషన్లు, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని వంద శాతం అమలు చేయాలని, విధుల్లో నిబద్ధతతో వ్యవహరించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, వివిధ పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 11 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నిర్మల్ టౌన్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం పదవీ విరమణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జూన్ నెలలో వయోపరిమితి తీరి పదవీ విరమణ పొందిన 11 మంది మండల విద్యాధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, అధికారిక ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ భోజన్న మాట్లాడుతూ, విద్యారంగంలో సదరు ఉపాధ్యాయులు అందించిన సుదీర్ఘ సేవలు చిరస్మరణీయమన్నారు. వేలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం వారు చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగం నుండి పదవీ విరమణ పొందినప్పటికీ, భవిష్యత్తులోనూ సమాజ వికాసానికి తమ వంతు సేవలు అందించాలని సూచించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులు తమ సుదీర్ఘ బోధనా అనుభవాలను పంచుకుంటూ విద్యాశాఖ తమకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ వినుకొండ ఆంజనేయ స్వామి సన్నిధిలో రంగనాథ్ కు సన్మానం



ఆర్మూర్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాలోని చారిత్రక పురపాలక పట్టణమైన వినుకొండలో గల ప్రసిద్ధ శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సాంస్కృతిక వేత్త జాదూ యుగంధర్ రంగనాథ్ ను ఘనంగా సత్కరించారు. ఆలయ ఆచార్య నారాయణ రామ్మోహన్, ప్రధాన అర్చకులు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాదూ యుగంధర్ రంగనాథ్ మాట్లాడుతూ, క్రీస్తుశకం 4 నుండి 7వ శతాబ్దాల మధ్య అమరపురం, ఇంద్రపాల నగరాలను రాజధానులుగా చేసుకొని పాలించిన విష్ణుకుండినుల చారిత్రక వైభవానికి వినుకొండ ప్రతీక అన్నారు. ఇంతటి మహోన్నత చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రంలో తనకు సన్మానం జరగడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ మద్దిరాల శివప్రసాద్, వ్యాపారవేత్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి:



హైదరాబాద్ బ్యూరో
అమెరికా సంయుక్త రాష్ట్రాల (ఖుూూ) స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అక్కడి ప్రజలకు, ప్రవాస భారతీయులకు, ముఖ్యంగా అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. తెలంగాణకు చెందిన వైద్యులు, ఇంజినీర్లు, ఐటీ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు తమ అసాధారణ ప్రతిభ, నిరంతర కృషి, అంకితభావంతో అమెరికా ప్రగతిలో విశేష పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. గ్లోబల్ వేదికలపై మన వృత్తినిపుణులు సాధిస్తున్న అద్భుత విజయాలు తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణంగా నిలుస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU


# పంట మార్పిడి, ఆయిల్ పామ్ సాగును ఉధృతం చేయాలి

## - కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలి
## - వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ కలెక్టరేట్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వ్యవసాయ, ఆరోగ్య శాఖలపై ఆయన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ ఏడాది 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేయడమే లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా చూడాలన్నారు. యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలని, ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతంతో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని అభినందించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



**జిల్లాలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం: కలెక్టర్ భవేశ్ మిశ్రా**

జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు క్షేత్రస్థాయి ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తున్నామని, ఎరువులు పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీపీఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మహమ్మద్ జీషాన్ అలీకి అంతర్జాతీయ డాక్టరెట్



నిర్మల్ టౌన్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ కు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మహమ్మద్ జీషాన్ అలీ అంతర్జాతీయ స్థాయి డాక్టరెట్ పట్టా పొందడం పట్ల పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద విద్యార్థులకు విద్యావసరాల నిమిత్తం అందిస్తున్న ఆర్థిక సహాయం, తమ పాఠశాలలో ఉచిత అడ్మిషన్ల కల్పన, పదో తరగతి విద్యార్థులకు ఉచిత కోచింగ్ లాంటి విశేష సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వారు పాండిచ్చేరిలో జరిగిన ప్రత్యేక వేడుకల్లో ఈ గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా జీషాన్ అలీ మాట్లాడుతూ, రాజకీయంగా, సామాజికంగా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేసేందుకు తనకు వచ్చిన ఈ డాక్టరేట్ పట్టా మరింత ఉత్సాహాన్ని కలిగించిందని పేర్కొన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్ లో అధికారికంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



నిర్మల్, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాటి కాలంలో తెలంగాణ ప్రజలను బానిసత్వపు సంకెళ్ళ నుంచి బంధవిముక్తి చేసేందుకు, నిజాం నిరంకుశత్వాన్ని, దొరల ఆగడాలకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య ఎంతో తెగువతో పోరాడారని గుర్తుచేశారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్రస్థాయి పరిశీలకులు



నిర్మల్ ప్రతినిధి, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్రస్థాయి విద్యా పరిశీలకుడు నాంపల్లి రాజేష్ శనివారం నిర్మల్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న విద్యా వసతులు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును ఆయన నిశితంగా పరిశీలించారు. నిర్మల్ రూరల్ మండలం పరిధిలోని ముజ్గి పాఠశాలను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ప్రాథమిక పూర్వ విద్య (ప్రీ-ప్రైమరీ) విభాగాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పరిశీలించారు. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి పాఠశాలలో విద్యార్థుల నూతన ప్రవేశాల నమోదు ప్రక్రియను, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన 'అపార్' (వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ) నమోదు పురోగతిని సమీక్షించారు. అలాగే, నర్సాపూర్ (జి) మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించి, యుడైస్ పోర్టల్‌లో పాఠశాల సమాచార నవీకరణ పనులను పరిశీలించి, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సాపూర్ (జి) ఉన్నత పాఠశాలలోని డిజిటల్ తరగతి గదులను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: ప్రధాని నరేంద్ర మోదీ

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాజస్థాన్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన విప్లవాత్మక అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు నేడు నేరుగా సామాన్య ప్రజలకు అందుతున్నాయని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యలనైనా త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ మార్గమని మోదీ పునరుద్ఘాటించారు.

**సంక్షోభంలోనూ రైతులకు కొండంత అండ**

అంతర్జాతీయ పరిణామాల వల్ల దేశీయంగా సాగు రంగానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ప్రధాని తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా రసాయన ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని గుర్తుచేశారు. ఈ అంతర్జాతీయ సంక్షోభం వల్ల బయటి దేశాల్లో యూరియా బస్తా ధర దాదాపు రూ.3,000 వరకు చేరిందని వివరించారు. అయినప్పటికీ, దేశంలోని అన్నదాతలపై ఆ ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం భారీగా రాయితీలు (సబ్సిడీలు) భరిస్తోందన్నారు. ఫలితంగా దేశంలోని రైతులకు కేవలం రూ.300 కే యూరియా బస్తాను అందిస్తూ అండగా నిలుస్తున్నామని ప్రధాని వెల్లడించారు. ఎరువుల కొరత లేకుండా చూసేందుకు దేశీయంగా యూరియా ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు వివరించారు.

**సమస్యల పరిష్కారంలో సరికొత్త వేగం**

గత పాలకుల కాలంలో ప్రజల సమస్యలు దశాబ్దాల తరబడి నలిగేవని, కానీ నేడు తమ ప్రభుత్వం నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరిస్తోందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సంక్లిష్టమైన సమస్యను కూడా కేవలం ఏడు రోజుల్లోనే పూర్తిస్థాయిలో పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కలిగించామని ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా డిజిటల్ విధానాలు, వేగవంతమైన నిర్ణయాలతో పాలనను ప్రజా చెంతకు చేరుస్తున్నామని చెప్పారు.

**మౌలిక వసతుల కల్పనతో ఉపాధి అవకాశాలు**

రాజస్థాన్ పర్యాటక, పారిశ్రామిక రంగానికి జోధ్‌పూర్ కొత్త విమానాశ్రయం ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. విమానయాన రంగంలో కనెక్టివిటీ పెరగడం వల్ల స్థానిక యువతకు భారీగా ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేవలం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రైతుల వ్యక్తిగత ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. రాజస్థాన్ సాధిస్తున్న ఈ ప్రగతి ప్రస్థానం దేశాన్ని 'వికసిత్ భారత్' వైపు నడిపించడంలో కీలక భూమిక పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని సంక్షేమ, మౌలిక వసతుల ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు.

# సీపీఎం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నివాళి



నిర్మల్ జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన కుమార్, బొమ్మెన సురేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ, 1946 జులై 4న అమరుడైన దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించడం నేటి తరానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమన్నారు. కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తోడుసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, చూంచుల నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ పాల్గొన్నారు.

# అధ్యాపకుడు భూషణ్ పాండే సేవలు అమూల్యం: సత్యనారాయణ గౌడ్




భైంసా, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా సుదీర్ఘ 36 సంవత్సరాల పాటు సేవలందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన భూషణ్ పాండే సేవలు అమూల్యమని వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ వి. సత్యనారాయణ గౌడ్ కొనియాడారు. భైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం భూషణ్ పాండే పదవీ విరమణ సందర్భంగా ఆయనను అత్యంత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, భూషణ్ పాండే సత్ప్రవర్తన కలిగి, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన అందించారని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసినప్పటికీ వశిష్ట కళాశాలకు ఎంతో సహాయ సహకారాలు అందించారని, ఆయనతో విడదీయరాని అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఈ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్. నారాయణ రెడ్డి, న్యాయవాది రవి పాండే, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్, నాయకులు గాలి రవి, ప్రభాకర్, సాయినాథ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పండరీపూర్ పాదయాత్ర భక్తులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సన్మానం



భైంసా, జూలై 4 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా పట్టణం నుండి పండరీపూర్ పాదయాత్రకు వెళ్లే విఠల్ భక్తులకు శనివారం భైంసాలోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్రకు బయలుదేరిన భక్తులను ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ శాలువాలతో ఘనంగా సన్మానించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం ఏటా ఆషాఢ ఏకాదశి సందర్భంగా నియమ నిష్టలతో ఈ దిండి పాదయాత్రను చేపట్టడం వల్ల భక్తితో పాటు సమాజంలో ఐక్యతా భావం పెంపొందుతుందన్నారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో లక్షలాది భక్తులు పాల్గొనడం దేశంలోనే ప్రత్యేకమన్నారు. దిండి పాదయాత్ర భక్తి, క్రమశిక్షణ, సేవ, సామరస్యతను చాటే గొప్ప ఆధ్యాత్మిక సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com